81.06 శాతం మంది ఓటేశారు!

- పురుషుల కంటే అధికంగా 4,606 మంది మహిళలు పోలింగ్
- మొత్తం పోలైన ఓట్లు 1,88,701
- 2019 కంటే 0.3 శాతం ఎక్కువ





మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలోని బూత్‌లలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు



ఓట్లు వేసేందుకు బార్లు తీరిన ఓటర్లు

నరసరావుపేట: నియోజకవర్గంలో సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్ 81.06 శాతం నమోదైంది. ఇది 2019లో కంటే 0.3 శాతం ఎక్కువ. మొత్తం ఓటర్లు 2,32,778 మంది కాగా వారిలో 1,88,701 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 92.040మంది కాగా, స్త్రీలు 4,606 మంది అధికంగా 96,646 మంది ఓటు వేశారు. మొత్తం 246 పోలింగ్ బూత్‌లలో ఓటింగ్ జరిగింది. 2019లో మొత్తం ఓటర్లు 2,21,728 మంది కాగా వారిలో 1,83,511 మంది ఓట్లు వేశారు. అప్పుడు వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీచేసిన ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి 55.46 శాతం ఓట్లు 1,00,994 పోల్‌కాగా, అతని ప్రత్యర్థిగా టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన డాక్టర్ చదలవాడ అరవింద బాబుకు 68,717 (37.73 శాతం) ఓట్లు పోలయ్యాయి. ఈసారి ఎన్నికల్లో మొత్తం 14 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా ఆర్డీవో పి.సరోజని వ్యవహరించారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలో సోమవారం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో 87.31 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొన్ని గ్రామాల్లో 6 గంటలకే పోలింగ్ పూర్తి అవ్వగా, మరి కొన్ని గ్రామాల్లో రాత్రి 9 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. మండలంలో 53,552 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉండగా 46,760 మంది ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

వైఎస్సార్ సీపీ వర్గీయులపై టీడీపీ పెత్తందార్ల దాడి



కావూరులో ఎస్సీ వర్గీయులతో మాట్లాడుతున్న కావటి మనోహర్ నాయుడు

- కావూరులో ఎన్నికల ఏజెంట్‌తో పాటు మరొకరికి తీవ్ర గాయాలు
- మంచినీటి ప్లాంట్ నుంచి నీరు తీసుకెళ్లకుండా కట్టడి
- స్పందించి అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్ నాయుడు

చిలకలూరిపేట: టీడీపీ నాయకులు పెత్తందారీ మనస్తత్వం మరోసారి వెలుగుచూసింది. ఇందుకు ఉదాహరణగా చిలకలూరిపేట మండలం కావూరు గ్రామంలో ఎస్సీకాలనీలో పోలింగ్ సందర్భంగా సోమవారం రాత్రి వైఎస్సార్‌సీపీ వర్గీయులపై టీడీపీ నాయకుల దౌర్జన్య కాండ నిదర్శంగా నిలుస్తోంది. బాధితులు కథనం ప్రకారం... కావూరు గ్రామంలోని ఎస్సీకాలనీ పోలింగ్‌బూత్ 211లో ఉదయం అర్ధగంట ఆలస్యంగా 7.30కు పోలింగ్ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో సాయంత్రం పోలింగ్ ముగిసే సమయానికి ఓట్లు కొన్ని పోల్ కావల్సినవి మిగిలి ఉన్నాయి. దీనికోసం సమయం పెంచాల్సిందిగా వైఎస్సార్‌సీపీ తరుపున బూత్ ఏజెంటుగా ఉన్న నలమాల కాంతయ్య అధికారులకు విజ్ఞప్తి చేశాడు. ఇది నచ్చని టీడీపీలో ఆధిపత్య సామాజిక వర్గానికి చెందిన కొందరు వచ్చి ఘర్షణకు దిగారు. బూత్‌లో ఏజెంట్‌గా ఉన్న నలమాల కాంతయ్యను బయటకు లాగి దాడి చేశారు. మాకు ఎదురు మాట్లాడతావా అంటూ కులం పేరుతో తీవ్ర దూషణలకు దిగారు. ఈ దాడిలో కాంతయ్యకు తీవ్రగాయలయ్యాయి. మూకల దాడిలో తలపగిలి పడిపోయాడు. కాంతయ్యపై దాడిని అడ్డుకునేందుకు వచ్చిన వైఎస్సార్ సీపీ వర్గీయులు కట్టెం ఆనందరావుతో పాటు మరి కొందరికీ కూడా ఈ ఘటనలో గాయాలయ్యాయి. స్థానికులు గాయపడిన వారిని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో కాంతయ్యతో పాటు ఆనందరావును మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. నరసరావుపేట ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్ గాయపడిన వారిని ఫోన్లో పరామర్శించారు.

కొనసాగిన వివక్ష...

ఈ ఘర్షణ నేపథ్యంలో కావూరు గ్రామంలో ఉన్న మంచినీటి ప్లాంట్ నుంచి ఎస్సీ వర్గీయులను మంగళవారం మంచినీరు తీసుకువెళ్లకుండా కట్టడి చేసి వారి దాష్టీకాన్ని చాటుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు గ్రామానికి వెళ్లి బాధితులకు అండగా నిలిచారు. ప్రస్తుతానికి ఎలాంటి నీటి సమస్య లేకుండా ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా చేసే ఏర్పాటు చేశారు. దీంతో పాటు ఎస్సీ కాలనీలో రూ.6 లక్షలు తన సొంత నిధులతో లూథరన్ చర్చి సమీపంలో కొత్తగా వాటర్ ప్లాంట్ నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు.

యడ్లపాడులో 89శాతం పోలింగ్



యడ్లపాడు మండలంలో ఓటు వేసేందుకు బారులు తీరి ఉన్న మహిళా ఓటర్లు (ఫైల్)

మండలంలో ఓటర్లు	-44,381
పోలైన ఓట్లు	-39,807

యడ్లపాడు: ఓట్ల పండుగ ముగిసింది. ఓటింగ్ సందడి సద్దుమణిగింది. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు పోటెత్తారు. ప్రతిపక్ష కూటమి నేతలు, కార్యకర్తల కవ్వింపు చర్యలతో కొండవీడు, సొలస, మైదవోలు, ఉన్నవ, యడ్లపాడు గ్రామాల్లో చెదురు ముదురు సంఘటనలు మినహా మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ రాత్రి అర్ధరాత్రి వరకు కొనసాగింది. పోలింగ్ ప్రక్రియ, ఓటర్ల ఉత్సాహం చూసిన రాజకీయ విశ్లేషకులు గ్రామస్థాయికే ప్రభుత్వ పరిపాలన చేరువకావడం, అన్ని వర్గాల అభ్యున్నతికి దోహదపడేలా సంక్షేమ పథకాలు అందించడం...ప్రతి కుటుంబానికి ఆయా పథకాలను అర్హతే ప్రామాణికంగా పారదర్శకంగా అమలు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్లస్‌పాయింట్ కావచ్చని అభిప్రాయపడుతున్నారు.

ఆ మూడుచోట్ల...

మండలంలోని మూడు గ్రామాల్లో పోలింగ్ ప్రక్రియ అర్థరాత్రి వరకు కొనసాగడంతో తెల్లవారుజామున ఈవీఎంలను డిస్ట్రిబ్యూషన్ రూంకు తరలించాల్సిన పరిస్థితి నెలకొంది. కొండవీడు గ్రామంలోని 59, 60 పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 9 గంటల వరకు పోలింగ్ జరిగింది. సొలసలోని 67వ పోలింగ్‌కేంద్రంలో రాత్రి 9 గంటల వరకు, మైదవోలు 74వ బూత్‌లో రాత్రి 11 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. దీంతో ఆయా రూట్‌లో ఉన్న అన్ని ఈవీఎంలు పోలింగ్ కేంద్రాల్లోనే ఉండిపోయాయి.

రాత్రి 11 గంటల వరకు ఓటింగ్...

మైదవోలులోని ఆర్సీఎం స్కూల్‌లోని పోలింగ్ బూత్‌ను ఎంపీపీఎస్ స్కూల్‌లోని బూత్‌కు మార్చడంతో చిన్నగదులు, ఆపై టీడీపీ వారితో అధికారులు మిలాఖత్ కావడంతో పోలింగ్‌ను ముందుకు సాగనివ్వలేదు. సొలసలో ఒకే బూత్ నందు 900లకు పైగా వైఎస్సార్‌సీపీ ఓటర్లు ఉన్నందున కూటమి నేతలు, బూత్ ఏజెంట్లు ప్రతిఓటుకు పదేపదే అభ్యంతరం చెప్పడంతో మందకోడిగా సాగింది. అయినా ఓటర్లు మాత్రం విసుగుచెందకుండా తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. కొండవీడు గ్రామంలో పోలింగ్ బూత్‌లోని ఈవీఎం పనిచేయనందున జాప్యం జరిగింది.

మండలంలో 89శాతం పోలింగ్...

యడ్లపాడు మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలో44,381 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 21,393 ఓటర్లు, మహిళలు 22,988 మంది ఓటర్లు ఉన్నారు. వీరంతా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అధికారులు 57 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సమస్యాత్మకమైన మండలంలోని ఉప్పరపాలెం 77,78 పోలింగ్ బూత్‌లు, కారుచోల 108,109, గుత్తావారి పాలెంలోని 110 బూత్‌లలో వెబ్‌క్యామ్‌లను ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ వేసవిని దృష్టిలో పెట్టుకుని షామియానాలు, మెడికల్ క్యాంపు, మంచినీరు ఏర్పాటు చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల ద్వారా 39,807 మంది ఓటర్లు తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకున్నారు. వీరిలో పురుషులు 19,192 మంది ఉండగా, మహిళలు 20,615 మంది ఓటర్లు ఉన్నారు. మండల మొత్తంగా 89 శాతం పోలింగ్ నమోదైంది.

ఓటర్ల చైతన్యం


ఎన్నడూ లేని విధంగా ఈసారి ఓటింగ్‌లో పాల్గొనేందుకు ఓటర్లు ఎంతో ఆసక్తి కనపరిచారు. కొత్తగా ఓటు వచ్చిన యువత నుంచి వందేళ్ల పైబడిన వృద్ధుల వరకు ఓటు వేసేందుకు ఉత్సాహం చూపారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభించగా, 6 గంటలకే పోలింగ్ కేంద్రాలకు చేరుకుని 'క్యూ' కట్టడమే ఇందుకు నిదర్శనం. అన్ని పోలింగ్ బూత్‌లలో ఓటర్లు దాదాపు 6 గంటల పాటు క్యూలో నిలబడ్డారు. బూత్‌లో ఓటువేసి బయటకు రావడానికి కనీసం గంట నుంచి గంటన్నర సమయం పట్టిందని ఓటర్లు చెబుతున్నారు. పోలింగ్ కేంద్రాల్లో బారులుదీరిన వారిలో అత్యధికులు మహిళలు, వయోజనులే కావడం విశేషం. ఎండ ప్రభావానికి మధ్యాహ్నం కొంత పలుచగా కనిపించినా సాయంత్రం 4 గంటల తర్వాత ఎక్కువ మంది కేంద్రాలకు తరలివచ్చారు. ఈవీఎంలో సాంకేతిక కారణాలు నెలకొన్నా, సాయంత్ర చీకటి పడినా క్యూను వీడలేదు..ఓటయ్యకుండా ఒక్క ఓటరు వెనుదిరగలేదు.

రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మృతి



యడ్లపాడు: వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దు విజయసారథి (40) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మండలంలోని ఉన్నవ గ్రామం ఉదయపూరి కాలనీకి చెందిన విజయసారథి చిలకలూరిపేట పట్టణంలోని ఓ సెల్‌షాపులో రిపేరుకు ఇచ్చిన ఫోన్ తెచ్చుకునేందుకు బంధువు మద్దు ఏసోబుతో కలిసి బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో యడ్లపాడులోని ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్ నూలుమిల్లు సమీపంలో వచ్చేసరికి బైక్ అదుపుతప్పింది. దీంతో ఎదురుగా పోలీసులు ఏర్పాటు చేసిన బ్యారికేడ్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో విజయసారథి తీవ్రంగానూ, ఏసోబుకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించి గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. సారధి ఆర్మీలో సోల్జర్‌గా చేరి దేశానికి సేవచేశాడు. వ్యక్తిగత కారణాలతో వలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నాడు. అప్పటి నుంచి గ్రామంలో స్వయం ఉపాధిగా సెంట్రింగ్ వర్క్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. వైస్సార్ సీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటు పార్టీ బలోపేతానికి కృషి చేశాడు. ఆయనకు భార్య ప్రియదర్శిని, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ జె శామ్యూల్ రాజీవ్‌కుమార్ పోస్టుమార్టం నిర్వహించి మంగళవారం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



నరసరావుపేట టౌన్: రైలు క్రింద పడి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బరంపేట మూడుబావుల సెంటర్ ప్రాంతానికి చెందిన షేక్ పొద్దుటూరు పెద్ద ఖాశిం (29) గత ఐదేళ్ల క్రితం కడపకు వెళ్లి అక్కడే టీస్టాల్ నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు రెండు రోజుల క్రితం నరసరావుపేటకు వచ్చాడు. సోమవారం బరంపేటలోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకుని తురకపాలెంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. అక్కడి నుంచి బజారుకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. రాత్రి నుంచి ఫోన్ స్విచ్ ఆఫ్ రావటంతో బంధువులు ఖాశిం కోసం గాలించారు. ఈ క్రమంలో మంగళవారం చిత్రాలయ థియేటర్ ఎదురు రైలు పట్టాలపై శవమై కనిపించాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ టి. సుబ్బారావు సంఘటనా స్థలానికి చేరకుని మృతదేహాన్ని పరిశీలించారు. విజయవాడ టు హుబ్లి ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురొచ్చి ఆత్మహత్య చేసుకున్నట్లు ట్రైన్ లోకో పైలెట్ సోమవారం రాత్రి సమాచారం అందించాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరావాల్సి ఉందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎన్నికల నేపథ్యంలో టీడీపీ దాడులు

క్రోసూరు: మండలంలో సోమవారం ముమ్మరంగా పోలింగ్ జరగటంతో వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఓటింగ్ జరిగిందన్న కక్షతో టీడీపీ కార్యకర్తలు దాడులు, దౌర్జన్యాలకు దిగుతున్నారు. మంగళవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ కార్యకర్తపై టీడీపీ కార్యకర్తలు కొందరు దాడి చేయబోగా తప్పించుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు అక్కడికి చేరుకుని జరిగిన విషయంపై నిలదీసేందుకు వెళ్లగా రాళ్లు, కర్రలతో దాడి చేయబోయినట్లు ఆ పార్టీ యూత్ నాయకుడు షేక్ షకుర్ తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపుచేశారు. క్రోసూరులోని కొండకింద బజారులోని టీడీపీ కార్యకర్త అదే వైఎస్సార్ సీపీ కార్యకర్త గండికోట సాయి ఇంటికి వెళ్లి గొడవపడ్డాడు. అతని అతని భార్యపై దౌర్జన్యం చేసి, ఇంటిలో సామగ్రి ధ్వంసం చేసాడని బాధితులు పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. గ్రామంలో ఉద్రిక్తతలు పరిస్థితి నెలకొనటంతో పోలీసులు దుకాణాలు మూయించారు.

నాదెండ్లలో పెల్లుబుకిన ఓటరోత్సాహం

- 88.1 శాతం పోలింగ్
- అత్యధికంగా ఇర్లపాడు 94.74, అత్యల్పంగా గణపవరం 83.6 శాతం నమోదు
- గత ఎన్నికల కన్నా భారీగా పెరిగిన ఓటింగ్ శాతం



నాదెండ్ల మండలంలో పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన మహిళా ఓటర్లు

నాదెండ్ల: నాదెండ్ల మండల పరిధిలో 16 సచివాలయాల్లో కలిపి 88.1 శాతం ఓటింగ్ నమోదైంది. గత ఎన్నికల్లో 79.13 శాతం పోలవగా, ఈదఫా ఎన్నికల్లో 9 శాతం పైబడి ఓటింగ్ పెరిగింది. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు భారీ ఎత్తున ఓటింగ్‌లో పాల్గొన్నారు. అత్యధికంగా ఇర్లపాడు గ్రామంలో 94.74 శాతం నమోదైంది. అతి స్వల్పంగా మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలో 83.6 శాతం నమోదైంది. సాతులూరు గ్రామంలో ఐదు పోలింగ్ బూత్‌లకు గాను 5979 మంది ఓటర్లుండగా, వీరిలో 5241 మంది (87.66 శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. కనపర్రు గ్రామంలో నాలుగు పోలింగ్ బూత్‌లకు 3427 మందికి గాను 3088 (90.11), ఇర్లపాడు గ్రామంలో రెండు పోలింగ్ బూత్‌లకు 1332 మందికి గాను 1262 (94.74), అప్పాపురంలో రెండు పోలింగ్ బూత్‌లకు 2148 మందికి గాను 1885 (87.76), అమీన్‌సాహెబ్ పాలెం ఒక పోలింగ్ బూత్‌కు గాను 972 మందికి గాను 880 (90.72) గణపవరంలో 15 పోలింగ్ కేంద్రాలకు గాను 13899 ఓటర్లు కాగా 11622 (83.6), ఎండుగుంపాలెంలో రెండు పోలింగ్ బూత్‌లకు గాను 1691 ఓటర్లకు గాను 1553 (91.83), నాదెండ్లలో 8 పోలింగ్ కేంద్రాలకు గాను 7637 మంది ఓటర్లకు గాను 6721 (88.01), తూబాడులో నాలుగు పోలింగ్ కేంద్రాలకు గాను 3609 మంది ఓటర్లకు గాను 3248 (90 శాతం) చందవరంలో మూడు పోలింగ్ బూత్‌లకు గాను 3151 మందికి గాను 2929 (92.95), బుక్కాపురంలో రెండు పోలింగ్ బూత్‌లకు గాను 1410 మంది ఓటర్లు కాగా 1323 (93.83), గొరిజవోలులో మూడు పోలింగ్ బూత్‌లకు గాను 2545 మందికి గాను 2306 (90.61), సంకురాత్రిపాడులో రెండు పోలింగ్ బూత్‌లకు గాను 2130 మందికి గాను 1911 (89.72), జంగాలపల్లెలో ఒక పోలింగ్ బూత్‌కు గాను 978 మంది ఓటర్లు కాగా 896 (91.62), చిరుమామిళ్లలో మూడు పోలింగ్ బూత్‌లకు గాను 2355 మంది ఓటర్లు కాగా 2100 (89.17) ఓటు హక్కు వినియోగించుకున్నారు.

మొత్తం 53,261 మందికి గాను 46965 మంది ఓటేశారు. మండే ఎండని సైతం లెక్క చేయకుండా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద మహిళా ఓటర్లు బారులు తీరి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో పోలింగ్ శాతం భారీగా పెరిగింది. సంకురాత్రిపాడు గ్రామంలో రాత్రి 9 గంటల వరకూ క్యూలైన్లలో నిల్చుని తమ ఓటు హక్కు వినియోగించుకోవటం విశేషం.

ఓటర్లలో పెరిగిన చైతన్యం





ఓటు వేయడానికి బారులు తీరిన మహిళా ఓటర్లు (ఫైల్)

- మొత్తం ఓట్లు 2,26,646
- పోలైన ఓట్లు 1,93,654
- వైఎస్సార్ సీపీకే విజయావకాశాలు

చిలకలూరిపేట: నియోజక వర్గానికి సోమవారం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో 85.44 శాతం పోలింగ్ నమోదైంది. పట్టణ పరిధిలో మొత్తం 86,840 ఓట్లు ఉండగా ఇందులో పురుషులు 40,754 , మహిళలు 46,064 ఇతరులు 22 మంది ఉన్నారు. చిలకలూరిపేట మండలంలో మొత్తం 42,256 ఓట్లు ఉండగా పురుషులు 20,349, మహిళలు 21,907 మంది ఉన్నారు. నాదెండ్ల మండలంలో మొత్తం ఓట్లు 53,169 ఉండగా ఇందులో పురుషులు 25,896, మహిళలు 27,246 ఇతరులు 27 మంది ఉన్నారు. యడ్లపాడు మండలంలో మొత్తం ఓట్లు 44,381 కాగా పురుషులు 21,393 మహిళలు 22,988 మంది ఉన్నారు. నియోజకవర్గం మొత్తంలో 2,26,646 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,08,392 కాగా, మహిళలు 1,18,205, ఇతరులు 49 మంది ఉన్నారు. ఇందులో పురుషులు 93,150 మంది ఓటు హక్కు ఉపయోగించుకోగా, మహిళలు 1,00,472 ఇతరులు 32 మంది ఓటు హక్కు ఉపయోగించుకున్నారు. మొత్తం 1,93,654 ఓట్లు పోలయ్యాయి. ఇది 85.44 శాతానికి సమా నం. నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన 239 పోలింగ్ కేంద్రాల ద్వారా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

గత ఎన్నికలతో పోల్చుకుంటే...

గత సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సరళిని గమనించినప్పుడు 1978లో 70.93 శాతం , 1983లో 69.01 శాతం, 1985 ఎన్నికల్లో 72.53 శాతం, 1989 ఎన్నికల్లో 68.03 శాతం,1994 ఎన్నికల్లో 65.45 శాతం, 1999 ఎన్నికల్లో 64.29 శాతం, 2004 ఎన్నికల్లో 73.70 శాతం, 2009 ఎన్నికల్లో 81.89 శాతం పోలింగ్ నమోదైంది. 2014 ఎన్నికల్లో 85.98 పోలింగ్ శాతం నమోదైంది. 2019 ఎన్నికల్లో 85.51 శాతం నమోదైంది. ప్రస్తుతం 2024 ఎన్నికల్లో 85.44 శాతం నమోదైంది. మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా ఓటర్లు బారులు తీరి తమ ఓటు హక్కు ఉపయోగించుకోవటం వారి చైతన్యానికి నిదర్శనంగా నిలిచింది. ఈవీఎంలు మొరాయించినా క్యూలో గంటల కొద్ది నిలబడి ఓట్లు వేశారు. ఉదయం ఆరుగంటల నుంచే ఓటర్లు ఓటు వేయటానికి పోలింగ్‌స్టేషన్ల వద్ద వేచి ఉండటం, మహిళలు, కొత్తగా ఓటు హక్కు పొందిన వారు ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొన్నారు.

ఎవరికి మేలు...

ఓటర్లలో అత్యధికులు మహిళలు, యువతరమే. నియోజకవర్గ పరిధిలో పురుషుల ఓట్ల కన్నా మహిళల ఓట్లు అధికం. మహిళల ఓట్లు 1,18,205 ఉండగా, పురుషుల ఓట్లు 1,08,392 ఉన్నాయి. దీని ప్రకారం మహిళల ఓట్లు 9,813 అధికం. పోలైన వాటి విషయానికి వస్తే పురుషులవి 93,150 కాగా, మహిళలవి 1,00,472 ఓట్లు పోలయ్యాయి. దీంతో మహిళల ఓట్ల పురుషుల కన్నా 7,322 అధికంగా పోలయ్యాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల లబ్ధిదారులు అత్యధిక శాతం మహిళలే కావడం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడుకు అనుకూలించే అంశంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంత్రిగా వ్యవహరించిన ప్రత్తిపాటి పుల్లారావు అధికారంలో ఉండగా తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న విషయం విదితమే. దీంతో తొలిసారి ఎమ్మెల్యే ఎన్నికల బరిలో ఉన్న యువ తరం ప్రతినిధి కావటి శివనాగ మనోహర్ నాయుడుకు యువతరం సైతం అండగా నిలిచే అవకాశం ఉండటం ఆయనకు కలిసివచ్చే అంశం.

మధ్యవర్తిత్వంతో ఎక్కువ కేసులు పరిష్కారం



మాట్లాడుతున్న న్యాయమూర్తి చిలంకుర్తి వెంకట నాగ శ్రీనివాసరావు

సత్తెనపల్లి: మధ్యవర్తిత్వం నిర్వహించి అధికంగా కేసులు పరిష్కరించేందుకు న్యాయవాదులు కృషి చేయాలని సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్), సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ చిలంకుర్తి వెంకట నాగ శ్రీనివాస రావు పేర్కొన్నారు. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు సత్తెనపల్లి బార్ అసోసియేషన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనతో పాటు సత్తెనపల్లి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తౌషిద్ హుస్సేన్, రెండవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు. ముందుగా జడ్జి వెంకట నాగ శ్రీనివాస రావు మాట్లాడుతూ మధ్యవర్తిత్వం చట్టం గురించి, కేసుల పరిష్కారంతో కక్షిదారులకు వచ్చే ప్రయోజనాలను తెలియజేశారు. ప్రజలకు ఈ-సెంటర్ ప్రాముఖ్యతపై న్యాయవాదులు అవగాహన కల్పించాలన్నారు. దీనిలో కేసు పరిష్కారమైతే కోర్టు ఫీజు వాపస్ ఇస్తారని, అంతేకాకుండా దీని ద్వారా వచ్చేది అంతిమ తీర్పు స్పష్టం చేశారు. ఆ శక్తి కలిగిన న్యాయవాదులు ఈ-సెంటర్ ద్వారా కేసుల్లో మధ్యవర్తిత్వం చేసేందుకు దరఖాస్తులు ఇవ్వాలన్నారు. సమావేశానికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ అధ్యక్షత వహించారు. పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్

మొదటి బహుమతి రూ.66.666

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల్లో స్టార్ సీసీ ఆధ్వర్యంలో వెంకి టెన్నిస్ బాల్ మెగా క్రికెట్ టోర్నమెంటు పోటీలు నేటి నుంచి ఆరంభిస్తున్నట్లు టోర్నీ నిర్వాహకులు మంగళవారం తెలిపారు. మొదట బహుమతి రూ.66.666 వేలు (జ్యోతి శేషయ్య) రెండవ బహుమతి రూ. 55.555 వేలు (ఏకే 47 టీం వేల్పూరు) మూడవ బహుమతి రూ.33.333 వేలు (దొప్పలపూడి శ్రీకాంత్) నాల్గవ బహుమతి రూ. 22.222 వేలు (దోడ్డా ఏడుకొండలు) మ్యాన్ ఆఫ్ ది సిరీస్ రూ.5.555 (కాకర్ల ఆంజనేయులు) షీల్డ్ బహూకరణ రూ.15.000లు లింగా పున్నమ్మ (ఎంపీటీసీ సభ్యురాలు) తమవంతు సహకారం అందజేస్తున్నట్లు చెప్పా రు. మ్యాచ్‌లో పాల్గొనే వారు ఎంట్రీ ఫీజు రూ. 999 రూపాయలు చెల్లించాలన్నారు. తుది నిర్ణయం కమిటీ, గ్రామపెద్దలదే అన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 898555 50551, 9704066656, 9052048214 సంప్రదించాలన్నారు.

17న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన వేడుకలు 17వ తేదీ ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి పుసులూరి శ్రీనివాసచారి మంగళవారం తెలిపారు. దాతలు సహకారంతో ఈ ఆరాధన వేడుకలు గత 10 సంవత్సరాల నుంచి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు.

పిడుగుపడి కాలిపోయిన కొబ్బరిచెట్టు



యడ్లపాడు: మండలం పరిధిలో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం మంగళవారం కురిసింది. దీంతో నిన్నామొన్నటి వరకు ప్రచండ భానుడి ఉగ్రరూపంతో వేడిగాలులు, ఉక్కపోతలతో ఇబ్బందులు పడ్డ మండల ప్రజలకు ఊరట కలిగింది. సోమవారం జాలాది, జగ్గాపురం గ్రామాల్లో పది నిముషాలు కురిసిన ఈ వర్షం మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల్లోనూ అత్యధికంగా కురిసింది. దీంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. మురుగు కాల్వల్లో చెత్తచెదారం ఉండటంతో కాల్వలు పొంగి పొర్లాయి.

కొబ్బరి చెట్టుపై పిడుగుపాటు


మండల కేంద్రమైన యడ్లపాడు ఎస్సీకాలనీ (కిందిపల్లె)కు చెందిన కారసాల మరియదాసు ఇంటి వద్ద ఉన్న కొబ్బరి చెట్టుపై వర్షానికి ముందుగా పిడుగు పడింది. దీంతో పచ్చని చెట్టుపై ఎర్రటి మంటలు ఒక్కసారిగా వ్యాపించాయి. ఇంటికి దూరంగా ఉండటంతో కేవలం చెట్టు మాత్రమే కాలిపోయింది.

108 వాహనంలో ప్రసవం



యడ్లపాడు: 108 వాహనంలో చక్కని ఆడపిల్ల జన్మించింది. ప్రసవ సమయంలో శిశువు పేగును మెడకు రెండు చుట్లతో ఉన్నప్పటికీ సిబ్బంది ఎంతో చాకచక్యంగా సుఖ ప్రసవం చేశారు. యడ్లపాడు మండలం కొత్త సొలస గ్రామానికి చెందిన ఇంద్రజకు సోమవారం అర్ధరాత్రి ఒక్కసారిగా పురిటినొప్పులు మొదలయ్యాయి. దీంతో 108కి ఫోన్‌ద్వారా సమాచారం అందించారు. చిలకలూరిపేట 108 అంబులెన్స్ గ్రామానికి చేరుకుని ఇంద్రజను పట్టణంలోని ఆసుపత్రికి తరలిస్తుండగా నొప్పులు అధికమయ్యాయి. దీంతో వాహనాన్ని పక్కకు ఆపి ఈఎస్‌టి శోభన్‌బాబు ప్రసవం చేశారు. పేగును మెడుకు చుట్టుకుని ఉన్నా తల్లిబిడ్డలు సురక్షితంగా ఉండేలా సుఖప్రసవం చేసి చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. 108 జిల్లా అధికారి సుబ్బారావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ అధికారి అజయ్ ఈఎంటీ శోభన్ బాబుతో పాటు పైలెట్ అల్లాబక్షును అభినందించారు.

జోరున వర్షం చల్లబడిన వాతావరణం



గురజాల: మండలంలో మంగళవారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం భానుడు తన ఉగ్రరూపం దాల్చాడు. సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. సుమారుగంట పాటు ఈదురు గాలులు వీస్తూ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు, కోర్టు భవనాల ప్రాంగణం, సెబ్ కార్యాలయాలు వర్షపు నీరు నిలిచింది.